క్లుప్తంగా

పల్లెప్రగతి పనులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్

దహెగాం: గ్రామాల్లో చేపట్టిన, చేపట్టాల్సిన పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని డంపింగ్ యార్డుల్లోని చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి కంపోస్టు ఎరువు తయారు చేసి నర్సరీల్లోని మొక్కలకు వినియోగించాలని సూచించారు. పల్లె ప్రకృతి, బృహత్ వనాల్లోని మొక్కలను సంరక్షించుకోవాలన్నారు. సమావేశంలో ఈజీఎస్ ఏపీవో కల్పన, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి



అభ్యాసన సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో

తిర్యాణి: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈవో వెంకటేశ్వర స్వామి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని మోహింద, తలండి, మాలగూడా, సుంగాపూర్ పాఠశాలలను ఆయన సందర్శించారు. పాఠశాలలో అమలు పరుస్తున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమ తీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరిలో కనీస అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించడంతో పాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖ ప్రత్యేక అధికారి సెడ్మకి రాము తదితరులు ఉన్నారు.

'సీఐటీయూ పోరాట ఫలితమే వేతనాల పెంపు'



కార్మికులకు స్వీట్లు తినిపిస్తున్న లోకేష్

రెబ్బెన: సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన అలుపెరగని పోరాటాల ఫలితంగానే మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెరిగాయని సీఐటీయూ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ అన్నారు. బుధవారం రెబ్బెనలో మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి విజయోత్సవ సభ ఏర్పాటు చేశారు. వేతనాలు పెరిగినందున కార్మికులకు స్వీట్లు తినిపించి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెలిశాల క్రిష్ణమాచారి, పాగిడి మాయ, విజయ, పద్మ, నిర్మల, శాంత, పోషవ్వ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ పవన్

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలోని గొల్లగూడ(కె) ప్రాథమిక పాఠశాలలో మన ఊరు -మన బడి పనుల్లో భాగంగా ప్రహరీ నిర్మాణానికి సర్పంచ్ పెందూర్ పవన్ భూమిపూజ చేశారు. ఉపాధిహామీ నిధుల నుంచి రూ.10లక్షల 40 వేల వ్యయంతో ప్రహరీ నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లలిత, వార్డు సభ్యులు మనోహర్, తిరుపతి, ఈశ్వరి, పంచాయతి కార్యదర్శి పోషం, మాజీ ఎంపీటీసీ గొల్ల, ఉపాధ్యాయులు అనూష, రాజు తదితరులు పాల్గొన్నారు.

పత్రాలు లేకుండా వాహనాలు నడపరాదు



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఎస్సై వెంకటేశ్

కెరమెరి: వాహనాలకు సంబంధించిన ధ్రువ పత్రాలు లేకుండా వాహనాలు నడపరాదని ఎస్సై నల్లా వెంకటేశ్ అన్నారు. బుధవారం మండలంలోని సాకడ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన పత్రాలను ప్రతీ వాహనదారుడు కలిగి ఉండాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను కూర్చొబెట్టకూడదన్నారు.

'నిధులు' నీళ్ల పాలు!



పూడికతో నిండిపోయిన గంగాపూర్ చెక్‌డ్యాం

- లక్ష్యానికి దూరంగా చెక్‌డ్యాం
- మట్టి, ఇసుకతో పూడుకుపోయిన వైనం
- వృథాగా కోట్ల రూపాయల నిధులు

రెబ్బెన: భూగర్భ జలాల పెరుగుదలే లక్ష్యంగా ప్రభుత్వం వాగుల్లో చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టింది. వాగు నుంచి వృథాగా పారుతున్న నీటికి అడ్డుకట్ట వేసి తక్కువ ఎత్తులో చెక్‌డ్యాంలు నిర్మించటం మూలంగా భూగర్భ జలాలు పెరగటంతో పాటు వాగు సమీప రైతులు మోటర్ల ద్వారా నీటిని వాడుకునేలా రూపకల్పన చేశారు. అయితే నిర్మాణాలు పూర్తి కాకముందే చెక్‌డ్యాంలు లక్ష్యానికి దూరమయ్యాయి. నిర్మాణాలు పూర్తయిన కొన్నేళ్లకే మట్టి, ఇసుకతో నిండిపోయి చుక్క నీరు కూడా నిల్వ ఉండలేని పరిస్థితికి చేరుకున్నాయి. దీంతో కోట్ల రూపాయల నిధులు నీళ్లపాలయ్యాయి.

అసంపూర్తిగానే నిర్మాణ పనులు

మండలంలోని గంగాపూర్ వాగులో సుమారు రూ.4.8 కోట్లతో ప్రభుత్వం చెక్‌డ్యాం మంజూరు చేయగా ఇరిగేషన్ అధికారులు 2019లో పనులు ప్రారంభించారు. ఏడాదిన్నరలోపు పనులు పూర్తి చేయాల్సి ఉన్నా ఇప్పటి వరకు చెక్‌డ్యాం నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. టెండర్ ద్వారా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కేవలం 80శాతం పనులు మాత్రమే పూర్తి చేశాడు. 2.8 మీటర్ల ఎత్తులో చెక్‌డ్యాం నిర్మించగా, గైడ్‌బండ్స్ (కరకట్టలు) నిర్మించాల్సి ఉంది. కాని పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. చెక్‌డ్యాం నిర్మించిన ప్రదేశానికి దిగువన ఉన్న పైప్ కల్వర్టు నుంచి వర్షాకాలంలో వచ్చే వరద ప్రవాహం నేరుగా చెక్‌డ్యాం నిర్మించిన ప్రదేశానికే వచ్చి చేరుతోంది. దీంతో ఇసుక మేటలు పేరుకుపోయి నీరు నిల్వ లేకుండా పోతోంది. చెక్‌డ్యాం నిర్మాణ పనులు చకచక చేపట్టిన అధికారులు పైప్ కల్వర్టు గుండా వచ్చే వరద ప్రవాహాన్ని దారి మళ్లించే చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

పనులు ఇంకా పూర్తి కాలేదు

గంగాపూర్ వాగులో నిర్మించిన చెక్‌డ్యాం పనులు ఇంకా పూర్తి కాలేదు. గైడ్‌బండ్స్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ మార్చిలోగా పనులు పూర్తి చేస్తాం. చెక్‌డ్యాం ద్వారా 3ఎంసీఎఫ్‌టీ నీరు నిల్వ ఉండేలా డిజైన్ చేశాం. దానికి అనుగుణంగానే నీరు నిల్వ ఉండేలా చూస్తాం. ఇప్పటి వరకు పూర్తయిన పనులకు మాత్రమే బిల్లులు చెల్లించాం. మిగిలిన పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– మదీన షేక్, ఏఈ, ఇరిగేషన్

నిర్లక్ష్యంగా నిర్మాణ పనులు..

చెక్‌డ్యాం నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. మరోవైపు చెక్‌డ్యాం పూర్తయిన కొన్నేళ్లకే పూడికతో పూర్తిగా నిండిపోయింది. ఈ చెక్‌డ్యాం ద్వారా 3 ఎంసీఎఫ్‌టీ నీరు నిల్వ ఉండేలా డిజైన్ చేసి నిర్మాణ పనులు చేపట్టారు. చెక్‌డ్యాం నిర్మించే సమయంలో తోడిన మట్టిని నీరు నిల్వ ఉండే ప్రాంతంలో పోశారు. అయితే చెక్‌డ్యాంకు సంబంధించిన బాడీవాల్ నిర్మాణం పూర్తయ్యాక మట్టిని తొలగించలేదు. దీంతో వర్షాకాలం వరదలతో మట్టి చెక్‌డ్యాం బాడీవాల్ వద్దకు చేరి నిండిపోయింది. చెక్‌డ్యాం పూర్తయితే నిల్వ ఉండే నీటి ద్వారా భూగర్భ జలాలు పెరగటంతో పాటు, నిల్వ నీటిని మోటర్ల ద్వారా పంటలకు అందించవచ్చని సమీప రైతులు ఆశపడ్డారు. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా చెక్‌డ్యాం మొత్తం మట్టి, ఇసుకతో పూడుకుపోయింది. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన చెక్‌డ్యాం ప్రస్తుతం ప్రయోజనం లేకుండా పోయింది.

నిలిచిన రోడ్డు పనులు

- ఏడాదిన్నర క్రితం ఐటీడీఏ ద్వారా రూ. 2.50 కోట్లు మంజూరు
- కంకర పోసి వదిలేసిన వైనం
- ఇబ్బందుల్లో పోలంపల్లి, దుబ్బగూడెం వాసులు
- పట్టించుకోని అధికారులు



కంకర పోసి వదిలేసిన పోలంపల్లి రోడ్డు

దహెగాం: మండలంలోని మారుమూల గిరిజన గ్రామం పోలంపల్లికి బీటీ రోడ్డు నిర్మాణానికి ఏడాదిన్నర క్రితం ఐటీడీఏ నిధులు మంజూరు చేసింది. రోడ్డు నిర్మాణ పనులను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించగా మొదట్లో పనులు చకచకా కొనసాగాయి. అయితే ప్రస్తుతం పనులు నిలిచిపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వర్షాకాలంలో నడవలేని పరిస్థితి..

పోలంపల్లిలో సుమారు 30 కుటుంబాలు ఉండగా 150 వరకు జనాభా ఉంది. పక్కనే ఉన్న దుబ్బగూడెం గ్రామంలో సుమారు 15 కుటుంబాలు 60 వరకు జనాభా ఉంది. ఈ రెండు గ్రామాలకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో మోకాళ్లోతు బురదలో నడుచుకుంటూ ఐనం గ్రామానికి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. పోలంపల్లికి రోడ్డు సౌకర్యం కల్పించడంలో అధికార పార్టీ నిర్లక్ష్యం వహిస్తుందని ప్రతిపక్షాలు పలుమార్లు విమర్శలు గుప్పించారు. ఈనేపథ్యంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఐటీడీఏ ద్వారా పోలంపల్లికి 2 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు.

రూ. 2.50 కోట్లు మంజూరు..

ఐటీడీఏ ద్వారా బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 2.50 కోట్లు మంజూరు చేయగా పనులు ప్రారంభించారు. కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగుపై వంతెన కూలడంతో రాకపోకలు నిలిచిపోయి రోడ్డుకు అవసరమయ్యే మెటీరియల్ అందలేదు. దీంతో పనులు నిలిచిపోయాయి. పెద్దవాగులో తాత్కాలిక రోడ్డు వేసి రాకపోకలు పునరుద్ధరించి నెలలు గడుస్తున్నా పోలంపల్లి రోడ్డు పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. పోలంపల్లి, దుబ్బగూడెం గ్రామాలకే కాకుండా, ఐనం గ్రామాల రైతులకు సంబంధించిన వ్యవసాయ పొలాలు కూడా ఈ మార్గంలోనే ఉండడంతో వారికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డుపై కంకర పోసి వదిలేయడంతో దుమ్మంతా పంటలపై పడి పంట రంగు మారుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పోలంపల్లి బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పనులు ప్రారంభిస్తాం

పోలంపల్లి గ్రామానికి మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయిన మాట వాస్తవమే. అందవెల్లి పెద్దవాగుపై వంతెన కూలడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం రాకపోకలు సాగుతున్నందున రోడ్డుకు అవసరమయ్యే మెటీరియల్ వచ్చేందుకు వీలుంది. పనులు రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తాం. గ్రావెల్‌తో పాటు ఆరు కల్వర్టుల నిర్మాణం పూర్తయ్యింది. బీటీ వేయడం ఆగిపోయింది. అది కూడా పూర్తి చేస్తాం.

– బద్రొద్దీన్, ఏఈ

'ఉపాధి' పనులు పరిశీలించిన ఏపీవో



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఏపీవో

కెరమెరి: మండలంలోని ఆగర్‌వాడ గ్రామ పంచాయతీ నాగల్‌గొంది గ్రామంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఈజీఎస్ ఏపీవో మల్లయ్య పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న నీటి నిల్వ కందకాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. గుట్టపై పడ్డ వర్షం నీరు జారిపోకుండా ఉండేందుకు కందకాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి సతీశ్, సర్పంచ్ మధూకర్ ఉన్నారు.

'కేంద్ర బడ్జెట్‌ను తిరస్కరించాలి'



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: నిరుద్యోగులకు ప్రాధాన్యమివ్వని కేంద్ర బడ్జెట్‌ను ప్రతిఒక్కరూ తిరస్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొత్తం బడ్జెట్ ప్రసంగంలో ఒక్కసారి కూడా ఆర్థిక మంత్రి నిరుద్యోగం అనే పదాన్ని ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. క్రీడలాభివృద్ధి, స్కిల్ డెవలప్‌మెంట్‌కు నిధులు కేటాయించకపోవడం దారుణమని విమర్శించారు. బీజేపీ హామీ ఇచ్చిన ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పన బూటకమేనని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నిఖిల్, తిరుపతి తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులను విస్మరించిన కేంద్రం..

రెబ్బెన: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిరుద్యోగ యువతను పూర్తిగా విస్మరించి నిధుల కేటాయింపుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారని డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. డీవైఎఫ్ఐ అధిష్టానం ఆదేశాల మేరకు బుధవారం బడ్జెట్ ప్రతులు దహనం చేశారు. సహాయ కార్యదర్శి తిరుపతి, కృష్ణ పాల్గొన్నారు.

జేఈఈలో గిరిజన విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన బాలురు (పీటీజీ)కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ సురేశ్ తెలిపారు. మెరుగైన ర్యాంక్ సాధించిన విద్యార్థులను బుధవారం కళాశాలలో శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్మీయెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పెందూర్ విష్ణేష్(78.86), కనక మనోహర్(53.35), సిడాం విష్ణువర్ధన్(51.90) ఉత్తమ మార్కులు సాధించారని పేర్కొన్నారు. మారుమూల గిరిజన గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థులు ఐటీడీఏ పీవో ఇచ్చిన ఉచిత శిక్షణతో జేఈఈలో రాణించినట్లు తెలిపారు. భవిష్యత్తులో వారు మంచి ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రోజ, సుజాత, సత్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

- ఎంపీపీ మల్లిఖార్జున్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు
- ముగిసిన సర్వసభ్య సమావేశం



అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: వేసవికాలం సమీపిస్తుండడంతో గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఎంపీపీ మల్లిఖార్జున్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావులు సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మల్లిఖార్జున్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గుండి పాఠశాల నుంచి బురుగ్గుడ ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయుడిని డెప్యూటేషన్‌పై ఎందుకు పంపించారని ఎంఈవో మణుకుమార్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్ ప్రశ్నించారు. ఈదులవాడలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, చిలాటిగుడలో పాఠశాల ఆవరణలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, గ్రామంలో ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలు తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని సర్పంచ్‌లు మహేష్, భీమేష్, దినకర్‌లు ఏఈ రవీందర్‌ను నిలదీశారు. స్పందించిన ఏఈ 15 రోజుల్లోపు ఆయా గ్రామాల్లో సమస్యలను పరిష్కరిస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సక్రమంగా పాలు, గుడ్లు సరఫరా కావడం లేదని సర్పంచ్‌లు బాబురావ్ భీమేష్ సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం ఇతర శాఖల అధికారులు తమ నివేదికలను సభకు చదివి వినిపించారు. సమావేశంలో ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ రామ్మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, కో ఆప్షన్ సభ్యులు అమానుల్లా పర్వీస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల వేతనాలు ఇప్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కౌటాల: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న కార్మికులకు వేతనాలు ఇప్పించాలని ఆయా గ్రామ పంచాయతీల కార్మికులు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. పలువురు కార్మికులు మాట్లాడుతూ గత 5, 6 నెలల నుంచి వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి వేతనాలు ఇప్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్మికులు శంకర్, నాగేశ్, మేరేశ్వర్, ప్రకాష్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

పంటలు పరిశీలించిన వ్యవసాయాధికారి



వరి పంటను పరిశీలిస్తున్న ఏవో

దహెగాం: మండల కేంద్రంతో పాటు లగ్గాం, ఒడ్డుగూడ తదితర గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయాధికారి వంశీక్రిష్ణ వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వరికి తెగులు సోకిందని, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు సూచించారు. వ్యవసాయాధికారులు ఇచ్చిన సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. ఆయన వెంట ఏఈవో శోభన్, రైతులు ఉన్నారు.

పరామర్శ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి గ్రామానికి చెందిన పెర్క సంతోశ్‌కు సంబంధించిన పత్తి అగ్నిప్రమాదంలో దగ్ధం కాగా, బుధవారం పలు సంఘాల నాయకులు పరామర్శించారు. వారు మాట్లాడుతూ సంతోశ్ కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల నష్టపరిహారంతో పాటు డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. రైతు హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు రేగుంట కేశవరావు, బీసీ సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్, భీం ఆర్మీ జిల్లా అధ్యక్షుడు పస్తం ఆంజనేయులు, నాయకులు రమణయ్య, సురేశ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

వాంకిడి: మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను తహసీల్దార్ రహీముద్దీన్ పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అనంతరం ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5000 చొప్పున జరిమానా విధించారు.

మండల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు

తిర్యాణి: మండల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నెలకొన్న ప్రజల సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని రంగాల్లో వెనుకబడిన తిర్యాణి మండలాన్ని అభివృద్ధి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో పార్లమెంట్ కో కన్వీనర్ కిరణ్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, కోకన్వీనర్ సార రమేశ్ గౌడ్, మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మడావి సీతారాం, జిల్లా గిరిజన మోర్చ ఉపాధ్యక్షుడు పెందూర్ ధర్ము, నాయకులు ఆత్రం గోపాల్, తిరుపతి, వల్క శ్రీధర్, కృష్ణరావు, గాయంగి తిరుపతి తదితరులు ఉన్నారు.

'పార్టీ బలోపేతానికి కృషి చేయాలి'

కాగజ్‌నగర్‌టౌన్: బూత్‌స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీజేపీ సిర్పూర్ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రజా కార్యాలయంలో బుధవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ పట్టణ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 25 వరకు పట్టణంలోని శక్తి కేంద్రాల పరిధిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నాయకులు ఈర్ల విశ్వేశ్వర రావు, కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేష్, దెబ్బటి శ్రీనివాస్, చేరాల శ్రీనివాస్, రాజేందర్, సంతోష్ కుమార్, అనిల్, రమేష్, మౌనిక, కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా అధికారిని దుర్భాషలాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న ఈవో, అర్చకులు, ఉద్యోగులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖలో డివిజన్ పర్యవేక్షకురాలిగా (ఇన్‌స్పెక్టర్‌గా) విధులు నిర్వహిస్తున్న రెంటాల సమతకు ఫోన్ చేసి దుర్భాషలాడిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ ఈవో వేణుగోపాల్ డిమాండ్ చేశారు. దేవాదాయ, ధర్మాదాయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని కేశవనాథస్వామి ఆలయంలో ఈవో వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఉద్యోగులు, అర్చకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు ఒజ్జల నరేష్‌శర్మ, వారణాసి శ్రీనివాస్‌రావ్, శ్రీధర్, మురళీధర్, అనంత్, విజయ్‌కుమార్, అభయ్‌కుమార్, ఆచార్య, శివరాం, రాజేశ్వర్ పాల్గొన్నారు.

మతిస్థిమితం కోల్పోయిన మహిళకు చికిత్స



చికిత్స అనంతరం దంపతులతో సీఐ, ఎస్సై

వాంకిడి: మండలంలోని ఇందాని గ్రామానికి చెందిన మతిస్థిమితం కోల్పోయిన మహిళ మహాత్మ మమతకు చికిత్స చేయించి పోలీసులు తమ ఉదారత చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మమత పరిస్థితిని గతంలో ఆమె భర్త మహాత్మ ధర్మాజీ సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ దృష్టికి తీసుకొచ్చాడు. దీంతో స్పందించిన పోలీసులు మమతకు ఎర్రగడ్డ ఆసుపత్రిలో చికిత్స అందించారు. రెండు నెలల చికిత్స అనంతరం కోలుకోవడంతో మమత కుటుంబ సభ్యులు సీఐ, ఎస్సైలకు కృతజ్ఞతలు తెలిపారు.